# వార్త

"అదిగో! ఇందాక మనం చూసిన హైకోర్టు అదే" చేతితో చూపించాను శీనుకి.

"ఏది ఎక్కడా?" శీను కళ్ళు ఆత్రంగా వెదికాయి.

మళ్ళీ చూపించాను.

తొమ్మిదేళ్ళ శీను హైకోర్టు వంక చూశాడు.

"కనబడ్డదా!" అడిగాను

తల వూపాడు.

నిన్న సాయంత్రం మనం వెళ్ళిన బిర్లామందిర్ ఎక్కడుందో చెప్పు అడిగాను.

చార్‌మినార్‌కుండే ఎడంవేపు మినార్ మీదనుంచి శీను దానికోసం వెదికి చేతితో చూపించాడు వుత్సాహంగా.

అదిగో వెంకటేశ్వరస్వామి ఆలయం.

బెంగుళూర్ వెళ్ళే రైలుబండిని చూపించాను. సిగరెట్ పెట్టెలంత చిన్నగా కనబడుతున్న రైలుబళ్ళని చూశాడు.

"అదే కదా మనం వచ్చిన రోడ్డు" క్రింద ఎదురుగా వున్నరోడ్డుని చూపించి అడిగాడు శీను.

"అదే"

"ఇక వెళదాం కళ్ళు తిరుగుతున్నాయి"

చార్‌మినార్ గోడలమీద అనేక వందలమంది తమ పేర్లు, సంతకాలు, చిరునామాలు రాశారు. శీనుకూడా నా బాల్‌పెన్ అడిగి తీసుకుని తన పేరు రాశాడు ఓ చోట.

హైదరాబాద్ చూడటానికి నా స్నేహితుడి తమ్ముడు శీను క్రితంరోజే వచ్చాడు. సోమవారం బాలానగర్ ప్రాంతంలో నేనుపనిచేసే ఫ్యాక్ట

రికి శెలవు కాబట్టి నా స్నేహితుడు శీనుని హైకోర్టుకీ, చార్మినార్‌కి తీసుకొనివెళ్ళి చూపించమని నన్ను కోరడంతో ఒప్పుకొన్నాను.

"నెహ్రూ జూ పార్క్ కికదా ఇప్పుడు మనం వెళ్ళేది?" అడిగాడు శీను మెట్లు దిగుతూ.

"అవును జాగ్రత్తగా చూసుకుని దిగు కాలు జారితే ఇబ్బంది" చెప్పాను.

అయిదు నిమిషాలలో కిందకు దిగాం. శీను చార్మినార్ కింద పడుకొని వున్న బిచ్చగాళ్ళని, కూర్చుని కబుర్లు చెప్పుకొంటున్న మనుషులని, కొద్దిదూరంలో ఆగివున్న డబల్ డెక్కర్ బస్సులను చూస్తున్నాడు..

"ఎక్స్‌క్యూజ్‌మి" ఒకతను నన్ను పలకరించాడు. అతనివంక ప్రశ్నార్థకంగా చూశాను. ఇదివరలో పేట్ల బస్‌స్టాప్‌లో అతన్ని చాలా సార్లు చూశాను. తాజ్‌మహల్ హోటల్ ప్రక్కసందులో ఓ చోట వుండే నాతో పనిచేసే ఓ సహద్యోగికి అతను దూరపు చుట్టం.

"ఎలా వున్నాయి వుద్యోగ ప్రయత్నాలు" అడిగాను మాకున్న కొద్దిపరిచయాన్ని పురస్కరించుకొని.

"మామూలే" దిగాలుగా నవ్వాడు. తర్వాత చెప్పాడు "చిన్న సహాయం చేయాలి"

"ఎంత?" అడిగాను అప్రయత్నంగా.

వెంటనే అతని మొహం సిగ్గుతోనో, లేదా అవమానంతోనో ఎర్రబడటం గుర్తించాను.

"డబ్బుకాదు"

"ఐయామ్‌సారీ. చెప్పండి"

"ఈ వుత్తరం పోస్టు చేద్దామనుకున్నాను కాని చిరాకులో మర్చిపోయాను మరేం అనుకోకుండా దయచేసి దీన్ని మర్చిపోకుండా పోస్టు చేయగలరా?" అడిగాడు.

తలవూపాను.

ఓ కవర్ అందించాడు నాకు.

"థాంక్స్ సర్. కొద్దిగా అర్జెంటుగా వెళ్ళాలి. అందుకే మీకీ శ్రమ" అన్నాడు.

"ఇట్సాల్ రైట్"

నేను శీను చేతిని పట్టుకొని మదీనా హోటల్ వైపు నడిచాను.

హైదరాబాద్‌లో సిటీబస్ ఎక్కడంలోని సౌఖ్యం కంటె, పదిమంది పట్టేగదిలో ముప్పైమంది మధ్య ముప్పైఒకటో వాడిగా వెళ్ళి ఇరకటం లోనే సుఖం వుంటుంది.

జూపార్క్‌కి సైకిల్ రిక్షా మాట్లాడాను. జూ అంతా చూసి రాత్రి ఏడున్నరకి శీనుని వాళ్ళింట్లో దింపాను. ఇద్దరం బాగా అలసిపోయాం. కాఫీ, టిఫిన్ అక్కడే ముగించుకొని బయటకు వచ్చాను.

వాళ్ళింటి ఎదురుగా గోడకి తగిలించి కనపడింది ఎర్రటిపోస్టుడబ్బా వెంటనే నా జేబులో వున్న, పోస్టు చేయడానికి ఇవ్వబడ్డ వుత్తరం గుర్తు వచ్చింది.

డబ్బా దగ్గరికి నడిచాను. పోస్టుచేయబోయేముందు చిరునామా చూశాను. ఓ స్థానిక దినపత్రికకి.

ఉద్యోగ ప్రయత్నంలో పంపే అప్లికేషన్ అయివుండవచ్చును కున్నాను అప్పుడు.

లంచ్ అవర్‌లో వర్కర్స్ కేంటీన్‌లో భోజనం చేస్తూంటే కన పడ్డాడు నా స్నేహితుడు నాలుగు రోజుల తర్వాత.

"గురూ మీ నిరుద్యోగి చుట్టం ఆ మధ్య ఓ వుత్తరం ఇచ్చి పోస్టు చేయమని చెప్పాడు. ఈసారి కనబడితే పోస్టుచేశానని చెప్పు" చెప్పాను నా స్నేహితునితో.

"వాడు పోయాడు గురూ" చెప్పాడు నా స్నేహితుడు చాలా బాధగా.

"అంటే?"

"చచ్చిపోయాడు"

"గుడ్ గాడ్! నాలుగురోజుల క్రితమే చార్మినార్ దగ్గరే కన పడ్డాడు నాకు."

"చార్మినార్ దగ్గరా?" ఆసక్తితో అడిగాడు.

"అవును."

"సోమవారమా?"

"కరెక్ట్! మనకి ఆ రోజు శెలవు"

"ఆ చార్మినార్ మీదనుంచే దూకి ఆత్మహత్య చేసుకున్నాడు."

"నిజం?"

నా గుండె క్షణకాలం కొట్టుకోవడం ఆగింది.

"అప్పను ఇంట్లో సంపాయిస్తున్న మిగతా అన్నదమ్ములతో చాలా రోజులుగా ప్రచ్ఛన్నయుద్ధం సాగుతోంది. ఉద్యోగ ప్రయత్నాలు ఎన్ని చేసినా కలిసిరాలేదు. విసిగిపోయాడు అన్నివిధాలా. ఇకతనకి ఈ ప్రపంచం మీద, తన జీవితంమీద ఆసక్తిలేదని, సోమవారం సాయంత్రం నాలిగింటికి చార్మినార్ మీదనుంచి దూకి ఆత్మహత్యచేసుకోదలచాననీ, తనా ధైర్యం చేయగలిగిన పక్షంలో ఆ వార్త ప్రచురించవలసిందనీ, ఓ దినపత్రికకి తన పూర్తి వివరాలతో వుత్తరం రాశాడు. అది వాళ్ళకి అందింది. ఇవాళ వుదయం ఆ వుత్తరం ఫోటోస్టాట్ కాపీ అతని ఫొటో ప్రచురించారు పేపర్లో"

నా గుండె దేవినట్లయింది.

ఆ చావు కబురు అతను ఆ పత్రికకు నా చేతే పోస్టు చేయించాడు.

❖